# రహదారులకు కొత్త రూపు

- 20వ వార్డులో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం
- జీవీఎంసీ రూ.96 లక్షల నిధుల కేటాయింపు
- 'గడపగడపకు నిధులు' రూ. 33 లక్షల ఖర్చు
- స్మార్ట్‌సిటీ నిధులు రూ.3 కోట్లు






పాదచారులకు ఉపయుక్తంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ దీపాలు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి. జీవీఎంసీ, గడపగడపకు మన ప్రభుత్వం(జీజీఎంబీ), స్మార్ట్‌సిటీ, ఆర్ అండ్ బీ శాఖ నిధులతో కొత్తరూపును సంతరించుకున్నాయి. రహదారుల విస్తరణ, బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు.



అమ్మవారి వీధిలో సీసీ రోడ్డు



చినవాల్తేరు రజకవీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

- జీవీఎంసీ నుంచి 20వ వార్డులో రహదారుల నిర్మాణానికి రూ.96 లక్షలు మంజూరయ్యాయి. గడపగడపకు మన ప్రభుత్వం నుంచి అదనంగా రూ.33 లక్షలు విడుదల చేశారు. వీటితో చిన్మయ మార్గం, ఆర్‌సీడీ ఆస్పత్రి రోడ్డు, మానసిక ఆస్పత్రి రహదారి, లాసన్స్ బే కాలనీ, ఈస్ట్ పాయింట్ కాలనీ, ఏయూ క్వార్టర్స్ పరిసరాలలో రహదారులను ఆధునికీకరించారు.
- స్మార్ట్ సిటీ నిధులు రూ.3 కోట్లు వెచ్చించి 20వ వార్డులో బీటీ రహదారులు, ఫుట్‌పాత్‌లను నిర్మించారు. ఫుట్‌పాత్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అదే విధంగా నిర్దేశించిన మార్గాలలో కొత్త రహదారులు నిర్మించారు.

### సీసీ రోడ్లకు మోక్షం

వార్డులోని గృహాలకు వెళ్లే మార్గాలలో అవసరమైన సీసీ రోడ్లు వేశారు. శివాజీపాలెం, చిన్నపోలమాంబ గుడి, పెదవాల్తేరులోని మునసబువారి వీధి, కాగితాలవారి వీధి, రజకవీధి, అమ్మవారి వీధి, చినవాల్తేరు మధురవీధి, శ్రామికనగర్ ప్రాంతాలలో కాంక్రీట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. చినవాల్తేరులోని అమ్మవారి వీధి, రజక వీధి, కొయ్యవీధి, పెదవాల్తేరులోని శ్రామిక్‌నగర్, పెదవాల్తేరు కాగితాలవారి వీధి, మునసబు వారి వీధిలో సీసీ రోడ్లను అభివృద్ధి చేశారు.

### రూ.5 కోట్లతో 100 అడుగుల రోడ్డు నిర్మాణం

ప్రస్తుతం పోలమాంబ ఆలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్కుకు వెళ్లే రహదారిని 60 అడుగుల నుంచి 100 అడుగులకు విస్తరిస్తున్నారు. ఇప్పటికే పోలమాంబ ఆలయం నుంచి మానసిక ఆస్పత్రి కూడలి వరకు రహదారి నిర్మాణం, డివైడర్లు, విద్యుత్ లైట్ల ఏర్పాట్లకు వైరింగ్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం మానసిక ఆస్పత్రి కూడలి నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందు కోసం ఆర్ అండ్ బీ శాఖ నుంచి దాదాపు రూ.5 కోట్లు వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ మార్గాన్ని విస్తరించడంతో పాటు నడకమార్గంలో వెళ్లే వారికి ప్రత్యేకంగా విద్యుత్ దీపాలను అమర్చుతున్నారు. కొత్త లుక్‌ని సంతరించే విధంగా ఇవి ఉన్నాయి. అదే విధంగా రహదారికి, ఫుట్‌పాత్‌కి మధ్యలో మొక్కలు పెంపకానికి ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. కొద్ది రోజుల్లో ఈ రహదారి ఆధునిక సొబగులు అద్దుకుని ప్రజలకు అందుబాటులోకి రానుంది. బీచ్ రోడ్డుకు దీటుగా ఈ రహదారిని ఆర్ అండ్ బీ శాఖ అభివృద్ధి చేస్తోంది.



మానసిక ఆస్పత్రి మార్గంలో విస్తరిస్తున్న రహదారి



చినవాల్తేరుకు వెళ్లే మార్గంలో వేసిన రోడ్డు

### అవసరాలకు అనుగుణంగా.....



ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. సమస్యలు చెప్పిన వెంటనే అధికారులు స్పందించి పరిష్కరించడం బాగుంది.

– ఎం.రమణ, విశ్రాంత ఉద్యోగి, శివాజీపాలెం

### పూర్తయిన రోడ్ల నిర్మాణం



పెదవాల్తేరు జంక్షన్‌ని ఆనుకుని ఉన్న శ్రామిక్ నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. పేద ప్రజలు నివాసం ఉండే ప్రాంతంలోని వీధుల్లో ఎటువంటి ఇబ్బంది కలగకుండా రోడ్లు వేయడం అభినందనీయం.

– కె.రాము, శ్రామిక్‌నగర్

## క్లుప్తంగా

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు జైసంతోషిమాత కాలనీలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. రూ.69.80 లక్షల ఎంపీ నిధులతో బీటీ, సీసీ రోడ్లు, కాలువల పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధాని చేయనున్న నేపథ్యంలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, ఆదినారాయణ, బొట్టా నాగ, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఎత్నిక్ డే వేడుకలు



వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: నే ఆడితే లోకమే ఆడదా.... అన్న చందంగా ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు ఆడిపాడారు. శనివారం విభాగంలో నిర్వహించిన ఎత్నిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దసంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలను ధరించి ఆకట్టుకున్నారు. ఫాస్ట్‌బీట్ పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలతో ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం మార్మోగింది. వేడుకలను ఏయూ పూర్వ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు రిచర్డ్ కింగ్, ఫర్వీన్‌అహ్మద్ తదితరులు తిలకించి, విద్యార్థులను అభినందించారు.

### నగరంలో ఇండియన్ ఐడల్ రేవంత్ సందడి



వీరుమామతో ఇండియన్ ఐడల్ రేవంత్

బీచ్ రోడ్డు: ఇండియన్ ఐడల్, బిగ్‌బాస్–6 విజేత రేవంత్ శనివారం నగరంలో సందడి చేశారు. వీరుమామతో ఆల్బమ్ చేయడానికి వచ్చిన ఆయన విశాఖతో విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. భవిష్యత్తులో విశాఖలో మరిన్ని ఆల్బమ్స్‌ను చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

### వైభవంగా శ్రీగీతా స్వాధ్యాయ యజ్ఞం



ప్రసంగిస్తున్న వి.సుబ్రహ్మణ్యశాస్త్రి

బీచ్ రోడ్డు: దసపల్లాహిల్స్ ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ప్రాంగణంలోని శ్రీగీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీగీతా స్వాధ్యాయ యజ్ఞం వైభవంగా జరిగింది. శ్రీగీతా జయంతి, శ్రీగీతా ప్రచార సమితి స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం మంగళధ్వని వేదమంత్రాలతో యజ్ఞం చేశారు. 18 హోమ కుండములతో 18 మంది రుత్వికులు 54 మంది దంపతులతో వేద పారాయణం చేశారు. మరో వైపు భక్తులు భగవద్గీత శ్లోకాలను పఠించారు. ముఖ్యఅతిథి ఆచార్య వి.సుబ్రహ్మణ్య శాస్త్రి భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ శ్రీగీతా జయంతి ప్రాముఖ్యతను వివరించారు. గీత సారాంశాన్ని పరిపూర్ణంగా తెలుసుకుని దానిని అనుసరిస్తూ జీవితాలను సార్థకత చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీగీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సిహెచ్.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.జగన్, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

# చూసిన కనులదే భాగ్యం

- ఘనంగా ముక్కోటి ఏకాదశి
- ఉత్తర ద్వారంలో స్వామిని దర్శించుకున్న భక్తజనం



ఎంవీపీ కాలనీ సెక్టార్–6లో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఏయూ క్యాంపస్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం తెల్లవారుజాము నుంచి పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఏడాది స్వామివారు రామావతారంలో భక్తులకు కనువిందు చేశారు.



రామావతారంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తుల సౌకర్యార్థం ఉచిత దర్శనంతో పాటు, రూ.100 ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పండరీభాయి, ఆర్.దశరథరామయ్య, జి.సత్యనారాయణ, బర్ల మంగరాజు, ఎం.పద్మజ, కె.వరప్రసాద్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీకోదండరామాలయ సహిత శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారికి విశేష అలంకరణ అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామివారి దర్శనానికి భక్తులు వేకువజాము నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీలా రమణ, కాండ్రేంగుల నూకేశ్వరరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



దర్శనానికి క్యూలైన్లలో వెళుతున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వర, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి ఆరాధన, తిరుప్పావై సేవా కాలం, పంచహారతి జరిపారు. తరువాత ఉత్తర ద్వారం వద్ద స్వామిని అధిష్ఠింపజేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



కొత్త వెంకోజీపాలెం వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

### వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం

అరిలోవ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు తూర్పు నియోజకవర్గంలో మండలాల వారీగా యువజన విభాగం అధ్యక్షులను కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో నాలుగు క్లస్టర్లు ఉన్న విషయం తెలిసిందే.

మండల యువజన విభాగం అధ్యక్షుడిగా క్లస్టర్–1కి బోని శ్రీను, క్లస్టర్–2కి నమ్మి లావకుమార్, క్లస్టర్–3కి బోర రమణారెడ్డి, క్లస్టర్–4కి నల్లమల్లి వెంకటనరేష్‌రెడ్డిని నియమించారు.

### కనువిందు.. నృత్య రూపకం

మద్దిలపాలెం : శ్రీకృష్ణ లీలలు నృత్యరూపకం ప్రేక్షకులను అబ్బురపరిచింది. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల నృత్యోత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం వైద్యులైన తండ్రి, కుమార్తెలు డాక్టర్ జయంతి రమేష్, జయంతి లక్ష్మి సృజతిలు భరతనాట్యంతో అందరి హృదయాలను దోచుకున్నారు. ముందుగా ఈ ప్రదర్శనను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ సుసర్ల రామ గోపాల్ జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ జయంతి రమేష్ నేటి తరానికి మన సంప్రదాయ నృత్యంలో మాధుర్యాన్ని అందించాలనే ఆకాంక్షతో తన కుమార్తె కుమారి సృజతితో కలిసి భరతనాట్యం చేశారు. అనంతరం కృష్ణ లీలలు నృత్యరూపకాన్ని స్థానిక డాక్టర్ వెంపటి చిన సత్యం కూచిపూడి క్షేత్రం అధ్యాపకులు హరిరామమూర్తి, సిద్ధేంద్ర యోగి కళా నిలయం శ్రీ సత్యభామ శిష్యులు ప్రదర్శించారు.



శ్రీకృష్ణ లీలల నృత్య రూపకంలో సన్నివేశాలు

# చిన్నారిని చిదిమేసిన లారీ



గాయపడిన దంపతులు మదీనావల్లి, హసీనాబీబీ



ప్రమాదంలో మృతి చెందిన అఫ్సీన్

- రేగుపాలెం వద్ద స్కూటీని ఢీకొని, వాహనంతో పరారైన డ్రైవర్
- విశాఖ నుంచి ఎస్.రాయవరం వెళ్తుండగా ప్రమాదం
- ముగ్గురికి గాయాలు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

యలమంచిలి రూరల్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఆరు నెలల చిన్నారి ప్రాణాలను బలిగొంది. అత్తారింటికి ఆనందంగా వెళ్తున్న విశాఖ మద్దిలపాలెంకు చెందిన మదీనావల్లీ కుటుంబం యలమంచిలి మండలం రేగుపాలెం హైవే కూడలి వద్ద శనివారం రోడ్డు ప్రమాదానికి గురైంది. చిన్నారి మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు. యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు అందజేసిన వివరాల ప్రకారం విశాఖనగరం మద్దిలపాలెంలో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్న మహ్మద్ మదీనావల్లీ, భార్య హసీనా బీబీ, కుమారుడు మంజస్, 6 నెలల పాప అఫ్సీన్‌తో ఎస్.రాయవరంలో ఉన్న అత్తవారింటికి స్కూటీపై బయలుదేరారు. రేగుపాలెం హైవేకూడలి వద్దకు చేరుకున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొంది. దీంతో వారంతా రోడ్డుపై పడిపోయారు. రోడ్డుపై పడిపోయిన చిన్నారి అక్కడికక్కడే మరణించింది. ప్రమాదానికి కారణమైన లారీతో సహా డ్రైవర్ పరారయ్యాడు.

హైవే నిర్వహణ పనుల కారణంగా రహదారికి సగభాగం వరకూ స్టాపర్లు ఉండడం, లారీ డ్రైవరు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు, యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన మదీనావల్లీ, భార్య హసీనాబీబీ, కుమారుడు మంజస్‌లను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. మదీనావల్లీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. పరారైన వాహనం, అందుకు కారణమైన డ్రైవర్‌ను గుర్తించడం కోసం ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. కుమార్తె మరణించడంతో మదీనావల్లీ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఏయూ సమాచారం

### 28, 29 తేదీల్లో బయోమిచికా 2కే23 సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగంలో ఈ నెల 28, 29 తేదీల్లో బయోమిచికా 2కే23 జాతీయ వర్క్‌షాప్ జరగనుంది. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిణి దేవి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో ఇమ్యునాలజీ, జెనిటిక్ ఇంజినీరింగ్, బయోకెమికల్ టెక్నికల్‌లతో శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ పరిశోధకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ కె.సమత

### మహిళా కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య పల్లవి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలిగా ఏయూ క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్‌ల నుంచి ఆమె శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం డాక్టర్ పి.ఉష నుంచి ఆచార్య పల్లవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య పల్లవిని ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, పలువురు ఆచార్యులు, తదిరతులు అభినందించారు.



వీసీ కె.సమత నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య కె.సమత

### రామకృష్ణాపురంలో శ్లాబ్‌ల నిర్మాణంపై వివాదం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో శ్లాబుల నిర్మాణంపై శనివారం వివాదం నెలకొంది. టౌన్ ప్లానింగ్ సిబ్బందికి, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గ్రామం ముడసర్లోవ క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉండడంతో ఇక్కడ పక్కా శ్లాబుల నిర్మాణానికి వీలు లేదు. దీంతో ఇక్కడ రేకులు షెడ్‌లకే పరిమితిమయ్యాయి. ఇప్పుడు పక్కాగా శ్లాబుల నిర్మాణానికి గ్రామస్తులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శనివారం ఇద్దరు వ్యక్తులు రెండు శ్లాబులు వేయడానికి సన్నాహాలు చేశారు. డెక్కింగ్ సిద్ధం చేసి శ్లాబు వేసే సమయానికి టౌన్ ప్లానింగ్ అధికారులు స్క్వాడ్ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. అనధికారికంగా వేస్తున్న శ్లాబ్ పనులు నిలిపేసి తొలగించడానికి సిద్ధమయ్యారు. దీంతో స్థానికులు అంతా కలిసి టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అడ్డుకున్నారు. సిబ్బంది, స్థానికుల మధ్య గంటల తరబడి వాగ్వాదం జరిగింది. ఆఖరుకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.



టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని అడ్డుకుంటున్న స్థానికులు

### మణికంఠకు అభినందన

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైఫిల్‌షూటింగ్ పోటీల్లో ఏయూ విద్యార్థి మణికంఠ కాంస్య పతకం సాధించాడు. మధ్యప్రదేశ్‌లో ఈ పోటీలు నవంబర్ 9 నుంచి 12 వరకు జరిగాయి. ప్రస్తుతం బీబీఏ రెండో ఏడాది చదువుతున్న మణికంఠను ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూపీఈ విభాగం విజయ్‌మోహన్, పల్లవి పాల్గొన్నారు.

### ఉపకరణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎంవీపీ కాలనీ: లాసన్స్ బే కాలనీ శాంత్రి ఆశ్రమం డెఫ్ అండ్ డెమ్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో దివ్యాంగుల నుంచి ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అలిమ్కో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో సముచిత స్థానం లభించాలన్నారు. ప్రతినెలా ఇచ్చే పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెట్టింపు చేయాలని, చదువు, క్రీడల్లో వారిని ప్రోత్సహించాలని కోరారు. 500 మంది దివ్యాంగులు ఉపకరణాలకు దరఖాస్తు చేసుకున్నారు. రూపాకుల రవికుమార్, జీవీఎంసీ ఏపీడీ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ



బీచ్ రోడ్డు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో ఉత్తర ద్వారంలో ఉన్న శ్రీవారిని ఎమ్మెల్సీ వంశీ కృష్ణ శ్రీనివాస్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### 26 నుంచి ఏవీఎన్‌లో 'ఆహ్వాన్–2కే23'

- హాజరు కానున్న సినీ తార అవికాగోర్, బుల్లెట్ భాస్కర్, ప్రసన్నకుమార్

డాబాగార్డెన్స్ : నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ ఏవీఎన్ కళాశాలలో ఈ నెల 26 నుంచి రెండ్రోజుల పాటు 'ఆహ్వాన్–2కే23'పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలిరోజు కార్యక్రమంలో ప్రముఖ సినీ తార అవికాగోర్, జబర్దస్త్ ఫేం బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్, రెండో రోజు కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ మెజీషియన్ బీఎస్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శనివారం కళాశాల ప్రాంగణంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ప్రముఖులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. కిసాన్ దివస్‌ను పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు(విద్యార్థులు) రైతులు పడే కష్టాల్ని వివరిస్తూ ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు రైతుల వేషధారణతో కూరగాయలు విక్రయించే స్కిట్ ప్రదర్శించారు. 26 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఫెస్ట్‌కు సంబంధించిన వివరాల్ని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, గాంధీ, అర్చన, భానుమతి తదితరులు పాల్గొన్నారు.